బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి

కేసీఆర్‌తో జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేల భేటీ

పార్టీ రజతోత్సవాలు, వరంగల్ సభపై అధినేత దిశానిర్దేశం

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భువనగిరి, తుంగతుర్తి, ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శుక్రవారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రజతోత్సవాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై వారికి కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. త్వరలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమావేశం ఉండనున్నట్టు తెలిపారు.

గారడీ మాటలు.. గాలి మేడలు

మొదటిపేజీ తరువాయి...

ఎండగట్టారు. ఏడాదికి కనీసం 20 వేల కోట్లు మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని గత బడ్జెట్‌లో చెప్పారని, 16 నెలల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. నియోజకవర్గానికి కనీసం 3,500 చొప్పున, మొత్తం 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించారని, కానీ 16 నెలల్లో నాలుగు ఇండ్లన్నా కట్టలేదని నిలదీశారు. రేవంత్, భట్టి కలిసి నిర్మించిన గాలి మేడగా బడ్జెట్‌ను హరీశ్ అభివర్ణించారు.

ఏడ బోయింది మీ రైతు భరోసా?

రుణమాఫీకి రూ.31 వేల కోట్లు సమీకరించుకున్నామని గత బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడు 20 వేల కోట్లు ఖర్చుచేశామని ఎలా చెప్పిందని హరీశ్ నిలదీశారు. రైతు భరోసా 12 వేలకు కుదించి, యాసంగిలో సగం మందికైనా ఇవ్వలేదని మండిపడ్డారు.

ఇది మార్పు కాదు.. ఏమార్పు

'మహాలక్ష్మి కింద రూ.2500, పింఛన్ రూ. 4 వేలకు పెంపు, రూ.15వేల రైతు భరోసా, రూ.2 లక్షల లోపు రుణమాఫీ, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, నిరుద్యోగ భృతి, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, ఆడపిల్లలకు స్కూటీలు, 5 లక్షల విద్యా భరోసా కార్డు, పంటలకు బోనస్, ఆర్టీసీ విలీనం, ఆటో డ్రైవర్లకు, వ్యవసాయ కూలీలకు ఏటా 12 వేలు.. ఇలా అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగవేసింది' అని హరీశ్ విమర్శించారు. ఎన్నికల ముందు 'నో ఎల్ఆర్ఎస్' అని ఇప్పుడు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

రైజింగ్ కాదు.. డౌన్‌ఫాల్!

తెలంగాణ రైజింగ్ అని చెప్తున్నారని కానీ, వాస్తవానికి అన్నింటా డౌన్‌ఫాల్ కొనసాగుతున్నదని హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలోనే దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా అంటూ దిక్కుమాలిన ప్రచారం చేయడం వల్ల పెట్టుబడులు రాలేదని పేర్కొన్నారు. హైడ్రా పేరిట, మూసీ ప్రక్షాళన పేరిట, బఫర్ జోన్ల పేరిట సృష్టించిన భయానక వాతావరణం వల్ల పెట్టుబడులు రాలేదని, రియల్ ఎస్టేట్ పడిపోయిందని చెప్పారు.

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

బీఆర్ఎస్ కృషి వల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతున్నదని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు.'ఏ ఊరికి పోదామో చెప్పండి. సంపూర్ణ రుణమాఫీ జరిగిందని తేలితే క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధం? మీరు రెడీనా? అని సవాల్ విసిరారు.

"సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు సేఫ్‌గా ఉన్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా శాసనమండలిలో చెప్పారు. కాళేశ్వరం అంటే మూడు బరాజ్‌లు, 19 సబ్‌స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 16 రిజర్వాయర్లు, 203 కిలోమీటర్ల టన్నెల్, 1,531 గ్రావిటీ కెనాల్స్. అన్నీ బాగున్నయ్. కేవలం మేడిగడ్డ బరాజ్‌లో ఏడు బ్లాకులు ఉంటే, ఒక బ్లాకులో ఒక పిల్లర్ మాత్రమే కుంగింది. ఇంత మాత్రానికే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందంటూ దుష్ప్రచారం చేయడం మంచిది కాదు. ఇది రాష్ట్రానికి నష్టం చేస్తుంది.

- హరీశ్‌రావు

అన్నిరంగాలూ ధ్వంసం

కాంగ్రెస్ పాలనలో ఒక్కో వ్యవస్థ దారుణంగా ధ్వంసమైందని హరీశ్ వాపోయారు. '15 నెలల్లో 83 మంది గురుకుల విద్యార్థులు మరణించారు. 1,913 ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం మూసేసింది. మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు, స్కాలర్‌షిప్‌లకూ రూపాయి కూడా ఇవ్వలేదు' అని హరీశ్ తూర్పారబట్టారు. కేసీఆర్ శ్రీకారం చుట్టిన విదేశీవిద్య పథకానికి కాంగ్రెస్ మంగళం పాడిందని మండిపడ్డారు.

ఎనుముల పాలనలో భూములు ఖతం

గచ్చిబౌలిలో 400 ఎకరాలను అమ్మి 30 వేల కోట్లు రాబట్టాలని చూస్తున్నారని, ఇప్పటికే టీజీఐఐసీ భూములు తాకట్టు పెట్టి 10 వేల కోట్ల అప్పు తెచ్చారని హరీశ్ మండిపడ్డారు. హెచ్ఎండీఏ ఆస్తులు తాకట్టు పెట్టి మరో 20 వేల కోట్ల అప్పుతెస్తమని ఇటీవలే అసెంబ్లీలో సమాధానం చెప్పారని గుర్తుచేశారు. ఫార్మాసిటీకి పచ్చని భూములెలా తీసుకుంటారంటూ సీతక్క, భట్టి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాదయాత్ర చేసి మరీ ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే భూములు వాపస్ చేస్తామని చెప్పారు. 14 వేల ఎకరాలు వాపసు ఇచ్చుడు లేదు..ఇంకో 16 వేల ఎకరాలు తీసుకుంటమని చెప్తున్నారని హరీశ్ ధ్వజమెత్తారు.

1.62 లక్షల ఉద్యోగాల భర్తీ చేసిన కేసీఆర్

అటెండర్ నుంచి ఆర్డీవో వరకు 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా చేసింది కేసీఆర్ అని హరీశ్ తెలిపారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో అక్షరాలా లక్షా 62వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ధోకా

'ఏడాదికి 20 వేల కోట్లు బీసీ సబ్ ప్లాన్ కింద పెడుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ఊదరగొట్టారు. మొదటి బడ్జెట్‌లో ఏమీ చేయలేదు. రెండో బడ్జెట్‌లోనూ 11 వేల కోట్లు మాత్రమే పెట్టారు' అని హరీశ్ విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద గత బడ్జెట్‌లో రూ.33,127 కోట్లు కేటాయిస్తే.. డిసెంబర్ నాటికి రూ.9,824 కోట్లు మాత్రమే ఖర్చుచేశారని అన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు 12 లక్షల చొప్పున ఇస్తామన్నారని, గతంలో మంజూరైన వారికీ నిధులు ఇవ్వకుండా గోస పెడుతున్నారని మండిపడ్డారు. మైనార్టీలకు గత బడ్జెట్‌లో 3003 కోట్లు పెట్టి.. వెయ్యి కోట్లు కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. వంద రోజుల్లో రెండోవిడత గొర్రెల పంపిణీ చేపడుతామని చెప్పి మాట తప్పారని.. నాయిబ్రహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్తు పథకం అమలు ప్రశ్నార్థకమైందని విమర్శించారు.

పడకేసిన పల్లె ప్రగతి

గ్రామాల్లో పల్లె ప్రగతి పడకేసిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పంచాయతీల బాగు కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతినెలా పల్లె ప్రగతికి 277 కోట్లు, పట్టణ ప్రగతికి 174 కోట్లు ఇచ్చింది. ఇప్పుడవన్నీ బంద్ అయినయ్. ఒక్కో పంచాయతీ సెక్రటరీ 10 లక్షల వరకు అప్పుల పాలయ్యారు' అని తెలిపారు.

వ్యవసాయ స్థిరీకరణకు కేసీఆర్ ఐదంచెల వ్యూహం

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కొత్త ఊపు తీసుకొచ్చింది బీఆర్ఎస్ పాలన అని హరీశ్‌రావు చెప్పారు. 'వ్యవసాయ స్థిరీకరణ కోసం కేసీఆర్ ఐదంచెల వ్యూహం అమలు చేశారు. అందువల్లే 2014లో 131 లక్షల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం.. తొమ్మిదిన్నరేండ్లలో 221 లక్షల ఎకరాలకు పెరిగింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం, కొత్తవి చేపట్టడం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా, రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందించామని వివరించారు. ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. రూ.5 లక్షల వరకు రైతుబీమా అమలు చేశామని చెప్పారు.

మీరు పెట్టగలిగే పూర్తిస్థాయి బడ్జెట్లు నాలుగే. అందులో రెండు పూర్తయిపోయినయ్. కానీ కలలు మాత్రం నిజమయ్యే దాఖలాలు కనిపించడం లేదు.

సీఎం అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆదాయం కుంటుపడింది. ఏ రాష్ట్రానికీ లేని ఆర్థిక మాంద్యం తెలంగాణకే వచ్చిందా? ప్రపంచంలో, దేశంలో కాదు.. మీ బుద్ధిలో, మీ ఆలోచనలోనే మాంద్యం ఉన్నది!

బాండ్ పేపర్లు బంగాళాఖాతంలో కలిసినయి. గాంధీలిచ్చిన వాగ్దానాలు గాలి మాటలే అయినయి. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదు గానీ, అందాల పోటీలు పెడుతరట. మింగ మెతుకు లేదు కానీ, మీసాలకు సంపెంగ నూనె అన్నట్టున్నది.

వ్యవసాయ విధ్వంసం వల్ల రైతులు, హైడ్రా విధ్వంసం వల్ల పేద, మధ్యతరగతి జనం గుండె ఆగి చనిపోతున్నరు. రియల్ ఎస్టేట్ కుప్పకూలి రియల్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఉపాధి దెబ్బతిని ఆటోడ్రైవర్లు చనిపోతున్నారు. చివరకు గురుకులాల చిన్నారులు కలుషిత ఆహారం తిని మరణిస్తున్నారు. వీటిన్నిటికీ బాధ్యత రేవంత్‌రెడ్డిదే. ఎందుకంటే సీఎం, హోంమంత్రి, సోషల్‌వెల్ఫేర్ మంత్రి, విద్యా మంత్రి అన్నీ ఆయనే!

2022లో దేశవ్యాప్తంగా ఉత్తమ పంచాయతీ అవార్డులిస్తే, 20కి 19 అవార్డులు తెలంగాణకే వచ్చినయ్. 2023లో 13 వచ్చినయ్. కాంగ్రెస్ పాలన ఎట్లున్నదంటే.. 2024లో రాష్ట్రానికి వచ్చింది ఒక్క అవార్డే!

రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ రూ.5 లక్షలపైబడి చికిత్స పొందినవారి సంఖ్య 200లోపే. రూ.12 కోట్లు కూడా ప్రభుత్వం ఖర్చు పెట్టలేదు. బీఆర్ఎస్ హయాంలో 607 మందికి రూ.40 కోట్లతో చికిత్స అందించినం.

ఇవాళ రేవంత్‌రెడ్డిని ఎన్నుకున్న ఒకే ఒక్క ఎర్రర్ కారణంగా, టెర్రర్‌ను చవిచూపిస్తున్నరు. ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలే కొలమానం. కానీ ఈ ఏడాది క్రైం రేటు 24శాతం ఎక్కువగా నమోదైందని డీజీపీనే చెప్తున్నరు.

అసెంబ్లీ సాక్షిగా 'బడే భాయ్.. చోటే భాయ్' బంధం బట్టబయలైంది. రాష్ట్రానికి నిధులివ్వని కేంద్రాన్ని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్ ప్రసంగంలో పల్లెత్తు మాట అనకపోవడమే ఇందుకు నిదర్శనం.

- హరీశ్‌రావు

బీఆర్ఎస్ హయాంలో గణనీయ అభివృద్ధి

- తెలంగాణ రాష్ట్ర జీఎస్డీపీ, తలసరి ఆదాయ గణాంకాలే నిదర్శనం
- రెండేండ్ల నుంచి జీఎస్డీపీ తగ్గుతున్నది
- ఛోటే భాయ్‌ని బడేభాయ్ కాపాడటం లేదు
- కేంద్రం వివక్షపై బడ్జెట్‌లో ప్రస్తావించలేదు
- అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం గత పదేండ్లలో గణనీయంగా అభివృద్ధి చెందిందని ఎంఐఎం పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పారు. అసెంబ్లీలో శుక్రవారం బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఒవైసీ పాల్గొంటూ.. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా గత పదేండ్లలో జరిగిన రాష్ట్ర అభివృద్ధిని ప్రశంసించకుండా ఉండలేమని అన్నారు. జీఎస్డీపీలో, తలసరి ఆదాయంలో తెలంగాణ జాతీయ సగటును దాటిపోయిందని, ఈ విషయాన్ని గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. గత రెండేండ్ల నుంచి జీఎస్డీపీ జాతీయ వృద్ధి రేటుకన్నా తక్కువగా నమోదవుతున్నదని అన్నారు. 'గత పదకొండేండ్లుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వడంలేదు. ముఖ్యమంత్రిసహా మంత్రులు కేంద్రం చుట్టూ తిరుగుతున్నా, వినతిపత్రాలు ఇస్తున్నా ఫలితం ఉండడంలేదు. ఇప్పటికే సీఎం 39 సార్లు ఢిల్లీ వెళ్లినట్టు చూశాను. బడే భాయి ఛోటే భాయిని కాపాడడంలేదు. కేంద్రం ఇంత వివక్ష చూపుతున్నా రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం. దీనిపై మేము మొదటినుంచీ ఆందోళన చేస్తూనే ఉన్నాం. రాష్ట్ర విభజన హామీలను కూడా కేంద్రం నెరవేర్చలేదు. రాష్ట్ర ప్రాజెక్టులకు ఎటువంటి సహాయం అందించలేదు' అని విమర్శించారు. పేర్లు మార్చడంపై చర్చను పక్కకుపెట్టి రాష్ట్రానికి రావాల్సిన వాటాను రాబట్టేందుకు సభ్యులు కృషిచేయాలని సూచించారు. 'నేను 1999లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. ఇప్పటివరకు 26 బడ్జెట్‌లు చూశాను. రాష్ట్ర అభివృద్ధికి అందరు ముఖ్యమంత్రులు కృషిచేశారు. విపక్షాలు కూడా తమవంతుగా మరింత అభివృద్ధి కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం సహజం' అని అన్నారు.

న్యాయవాదుల సంక్షేమ నిధికి 100 కోట్లు ఇవ్వండి

ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ):న్యాయవాదుల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లతో ఏర్పాటుచేసిన సంక్షేమ నిధికి అదనంగా, కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.100 కోట్లు జోడించాలని బీఆర్ఎస్ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. శుక్రవారం అసెంబ్లీలో న్యాయవాదుల సంక్షేమనిధి, న్యాయవాద క్లర్క్‌ల సంక్షేమనిధి చట్ట సవరణ బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులకు మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. టికెట్ ఫీజును రూ.100 నుంచి రూ.250కి పెంచడం సరికాదని బీఆర్ఎస్ సభ్యుడు కాలేరు వెంకటేశ్, న్యాయవాదులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్, సంక్షేమ నిధికి రూ.200 కోట్లు ఇవ్వాలని కాంగ్రెస్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. అనంతరం రెండు బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

సాగర్ డేంజర్ బెల్స్!

డెడ్‌స్టోరేజీకి చేరువలో నీటిమట్టం • వరదకాల్వకు ఆగిపోయిన నీళ్లు

- నిలిచిపోయిన వరదకాల్వ మోటర్లు
- నీరులేక బోసిపోతున్న ప్రధాన కాల్వ
- 30 వేల ఆయకట్టుపై నీలినీడలు
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు
- శ్రీశైలం నుంచి నీరు విడుదల చేస్తేనే ఆయకట్టు పరిధిలో యాసంగి గట్టెక్కేది
- ప్రభుత్వ అసమర్థతతోనే ఈ దుస్థితి
- తక్షణ చర్యలకు రైతుల డిమాండ్

మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో ఎండిపోయిన వరదకాల్వ

నల్లగొండ ప్రతినిధి, మార్చి 21 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్‌లో అడుగంటిన నీటి నిల్వలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా వానలు పడినప్పటికీ, నవంబర్ చివరి దాకా సాగర్ డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నప్పటికీ, గత ఐదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా వేసవి ఆరంభంలోనే డెడ్‌స్టోరేజీ లెవల్‌కు చేరువైంది. దీంతో నల్లగొండ జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

నిజానికి, గత జూలై చివరి వారం నుంచే నాగార్జునసాగర్‌కు వరద మొదలై కొద్దిరోజుల్లోనే పూర్తిగా నిండింది. అప్పటినుంచి అక్టోబర్ వరకు సాగర్ డ్యామ్ గేట్ల పై నుంచి కృష్ణమ్మ దిగువకు ప్రవహిస్తూనే ఉన్నది. నవంబర్ చివరి వరకు డ్యామ్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం కొనసాగింది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఈ ఏడాది 1,203 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, కుడి కాల్వకు 185 టీఎంసీలు, ఎడమ కాల్వకు 114 టీఎంసీలు, ప్రధాన జల విద్యుత్తు కేంద్రం ద్వారా 245 టీఎంసీల నీటిని విడుదల చేశారు. క్రస్ట్ గేట్ల ద్వారా మూడు నెలలపాటు 623 టీఎంసీల నీరు సముద్రం పాలైంది. డిసెంబర్ నుంచి ఎడమ, కుడి కాల్వల ఆయకట్టుకు యాసంగి పంటలకు నీటి విడుదల మొదలైంది. కుడి కాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్ విచ్చలవిడిగా నీటిని తరలించుకుపోవడంతో సాగర్ డ్యామ్‌లో నీటి మట్టం చూస్తుండగానే అడుగంటిపోయింది. దీంతో 3 నెలల్లోనే నిండుకుండలా ఉన్న సాగర్ డెడ్‌స్టోరేజీకి చేరువైంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సాగర్‌లో నీటి నిల్వ 519.60 అడుగుల వద్ద 148.5482 టీఎంసీల నీరు ఉన్నది. అంటే డెడ్‌స్టోరేజీకి పైన ఇంకా 9.60 అడుగులు (16.8792 టీఎంసీలు) నీరు మాత్రమే నిల్వ ఉన్నది.

నిలిచిపోయిన మోటర్లు

నాగార్జునసాగర్‌లో నీటిమట్టం తగ్గిపోవడంతో వరదకాల్వకు నీటిని ఎత్తిపోయాల్సిన మోటర్లు నిలిచిపోయాయి. సాగర్‌లో 521 అడుగులకుపైగా నీటిమట్టం ఉంటేనే మొత్తం మూడు మోటర్లలో కనీసం రెండు మోటర్లను రన్ చేయడానికి వీలవుతుంది. 520 అడుగులపైన ఉంటే ఒక్క మోటర్ మాత్రమే రన్ అవుతుంది. అయితే, ఈ నెల 13వ తేదీ నాటికే నీటిమట్టం 521 అడుగులకు పడిపోవడంతో ఒక్క మోటర్‌నే రన్ చేశారు. ఈ నెల 15 నుంచి 519.70 అడుగులకు తగ్గిపోవడంతో ఆ ఒక్క మోటర్ కూడా నిలిచిపోయినట్టు అధికారులు తెలిపారు. దీంతో వారం రోజులుగా వరద కాల్వలోకి నీటి విడుదల నిలిచిపోయింది. అధికారులు చెప్తున్న దాని ప్రకారం.. ప్రస్తుతం నాలుగు గంటలు వేచి చూస్తే, సర్జ్‌పూల్‌లోకి ఊట ద్వారా వచ్చి చేరుతున్న నీటితో ఒక గంటపాటు ఒక మోటర్‌ను రన్ చేయగలుగుతున్నారు. దీనిద్వారా ప్రధాన కాల్వలోకి కేవలం 12 కిలోమీటర్ల వరకు నీరు పారుతున్నది. తూములకు నీళ్లు ఎక్కడం లేదు. మోటర్లు నిలిచిపోవడం వల్ల నిడమనూరు మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు మాడ్గులపల్లి, వేములపల్లి మండలాల్లోని 30 వేల ఎకరాల పంటలపై తీవ్ర ఆందోళన నెలకొన్నది.

వరదకాల్వ రైతులకు శాపం

కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డగోలుగా తరలించుకుపోతున్నా, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర నటించడం నల్లగొండ జిల్లాలోని వరద కాల్వ ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. నాగార్జునసాగర్ నుంచి విచ్చలవిడిగా ఏపీ సర్కార్ నీటిని తరలించుకొనిపోవడంతో డెడ్‌స్టోరేజీకి రిజర్వాయర్ చేరువైంది. దీంతో వరదకాల్వ పంపుహౌస్‌కు నీరు అందడం లేదు. దీంతో వరదకాల్వకు నీటిని ఎత్తిపోయాల్సిన మూడు మోటర్లు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా వరదకాల్వ పరిధిలోని 30 వేల ఎకరాల్లోని పంటలకు గడ్డు పరిస్థితులు దాపురించాయి. కనీసం మరో పదిహేను రోజులు నీటిని విడుదల చేస్తేనే పంటలు చేతికి వస్తాయని రైతులు చెప్తున్నారు. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసి, సాగర్ ఎడమ, కుడి కాల్వలకు నీటి విడుదలను నియంత్రిస్తే తప్ప, మరో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. సాగర్ కనీస నీటిమట్టం 521 అడుగులకుపైగా ఉంటేనే రెండు మోటర్లనైనా రన్ చేసే అవకాశం ఉంటుందని ప్రాజెక్టు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద కాల్వ పరిస్థితి చర్చనీయాంశంగా మారింది.

శ్రీశైలం వైపు ఆశగా చూపులు

శ్రీశైలం నుంచి నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తే తప్ప.. వరదకాల్వ మోటర్లు ఆన్ అయ్యే అవకాశం లేదు. శ్రీశైలం నుంచి తెలంగాణ పవర్‌హౌస్ ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తే, రెండు మూడు రోజుల్లో సాగర్‌లో నీటిమట్టం కనీసం రెండు అడుగులు పెరిగితేనే వరదకాల్వ ఆయకట్టకు నీరు అందుతుంది. అంటే సాగర్‌లో కనీసం 521 అడుగుల నీటిమట్టం మెయిన్‌టెన్ చేస్తే తప్ప, వరదకాల్వ మోటర్లు పూర్తిస్థాయిలో నడిచే పరిస్థితి లేదు. ఇదే విషయాన్ని వారం క్రితమే ప్రాజెక్టు అధికారులు స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. దీంతో శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 18 నాటికి సాగర్‌లో నీటిమట్టం 518.80 అడుగులకు పడిపోయింది. దీంతో శ్రీశైలం నుంచి పవర్ జనరేషన్ ద్వారా నీటిని వదులుతుండటంతో 3 రోజుల్లో 0.80 అడుగుల నీటిమట్టం పెరిగి, 519.60 అడుగులకు చేరింది. కానీ, 521 అడుగులు దాటితేనే కనీసం 2 మోటర్లు నడుపవచ్చని అధికారులు చెప్తున్నారు. ఎడమ, కుడి కాల్వలకూ నీటి విడుదలను తగ్గించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మొత్తంగా శ్రీశైలం నుంచి వచ్చే నీటిపైనే వరదకాల్వ ఆయకట్టు భవిష్యత్ ఆధారపడి ఉన్నది. గత ఐదేండ్లల్లో కిందటి ఏడాదిని వదిలేస్తే కేసీఆర్ హయాంలోని చివరి నాలుగేండ్లు ఏనాడూ వరదకాల్వకు నీటి విడుదల నిలిచిపోలేదని అధికారులు చెప్తున్నారు.

80 వేల ఎకరాల ఆయకట్టు కోసం

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పైభాగంలోని ఏఎంఆర్పీ ఆయకట్టు దిగువ ప్రాంతంలోని పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లోని సుమారు 80 చెరువులను నింపి 80 వేల ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశంతో వరదకాల్వ నిర్మాణం చేపట్టారు. నాగార్జున సాగర్ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ఆధారంగా రిజర్వాయర్‌లో నీటిమట్టం 570 అడుగులు చేరగానే గ్రావిటీ ద్వారా వరదకాల్వలోకి నీరు పారే విధంగానూ, అంతకు తక్కువ నీటిమట్టం ఉన్న సమయంలో మోటర్ల ద్వారా ఎత్తిపోసే విధంగానూ డిజైన్ చేశారు. 2006లో సాగర్ రిజర్వాయర్‌కు ఆనుకుని ఉన్న పెద్దవూర మండలం పుల్యాతండా నుంచి వేములపల్లి మండలం మొల్కపట్నం వరకు 86 కిలోమీటర్ల పొడవుతో ప్రధాన కాల్వను, దాని నుంచి డిస్ట్రిబ్యూటరీలను నిర్మించి 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలనేది దీని లక్ష్యం. ప్రత్యక్షంగా 50 వేల ఎకరాలకు, పరోక్షంగా మరో 30 వేల ఎకరాలకు దీని ద్వారా సాగునీరు అందుతుంది. దీన్ని కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే వదిలేయడంతో బీఆర్ఎస్ సర్కార్ వచ్చాక 2016లో పంపుహౌస్‌ను పూర్తి చేసి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మోటర్లను ఆన్ చేసి కాల్వలోకి నీటిని విడుదల చేశారు. అప్పటి నుంచి దీని పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందుతున్నది. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 2023 యాసంగి వరకు సమృద్ధిగా నీరు అందించడంతో రైతులు పుష్కలంగా పంటలు పండించుకున్నారు. కానీ, ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సీజన్ చివరలో ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.

మార్చి 21న వరుసగా ఐదేండ్ల సాగర్ నీటిమట్టం (అడుగుల్లో..), నీటి నిల్వ (టీఎంసీలలో..) వివరాలు

సంవత్సరం	నీటిమట్టం	నీటినిల్వ	ప్రభుత్వం
2020 మార్చి 21	550.30	210.4391	బీఆర్ఎస్
2021 మార్చి 21	548.10	205.6107	బీఆర్ఎస్
2022 మార్చి 22	558.80	229.5904	బీఆర్ఎస్
2023 మార్చి 21	534.60	177.2662	బీఆర్ఎస్
2024 మార్చి 21 (సాగర్ నిండలేదు)	513.60	137.8647	కాంగ్రెస్
2025 మార్చి 21	519.60	148.3665	కాంగ్రెస్



ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులకు కష్టాలు

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఏనాడూ ఇబ్బందులు పడలేదు. ఏఎమ్మార్పీ వరదకాల్వ మొదటినుంచి చివరి వరకు 30 వేల ఎకరాల వరకు సాగవుతాయి. నాగార్జునసాగర్ జలాశయం నిండుగా ఉన్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం సరిగా నీటిని వాడుకోకుండా, ఆంధ్రా రాజకీయాలకు భయపడి నీళ్లు అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి మరీ సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం సరైన ప్రణాళికతో నీటిని వాడుకోలేదు. నీటి సరఫరాపై ప్రభుత్వానికి ఏమాత్రం అవగాహన లేదు. ప్రణాళికాబద్ధంగా వాడుకుంటే ఈ పరిస్థితి వచ్చేదికాదు. ప్రభు త్వం కండ్లు తెరిచి సాగునీరు అందించా లి.

– వెన్న శ్రవణ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాడ్గులపల్లి



పంటలు ఎండిపోతున్నాయి

నాకున్న నాలుగెకరాల్లో వరి పంట సాగు చేశా. పది రోజుల నుంచి వరద కాల్వ నీళ్లు రాకపోవడంతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. మరో 20 రోజులైతే నా పంట చేతికొస్తుంది. కానీ, ఈ సమయంలో నీరు అందించకపోవడంతో పంటలు ఎండిపోయి పశువులకు మేపడానికి తప్ప ఏం ఉపయోగం లేదు. వెంటనే అధికారులు వరద కాల్వ ద్వారా నీటిని అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలి.

–తవిటి సైదులు, రైతు, నారాయణపురం, మాడ్గులపల్లి మండలం

పంచాయతీ సిబ్బందికి వేతనాలివ్వండి

- 5 నెలలుగా జీతాల్లేక సిబ్బంది అవస్థలు
- ఆర్టీసీ, సింగరేణి, జెన్‌కోను కాపాడండి
- బడ్జెట్‌పై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, మార్చి 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి 5 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారికి వెంటనే వేతనాలు ఇచ్చేందుకు చొరవ చూపాలని సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ఐదు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని తెలిపారు. ఆర్టీసీ, సింగరేణి, జెన్‌కో తదితర సంస్థలను కాపాడాలని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా వ్యక్తి కేంద్ర బడ్జెట్ (పర్సన్ సెంట్రిక్ బడ్జెట్)ను తేవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని సూచించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని, సామాజిక పింఛన్లను పెంచాలని, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మంజూరు చేయాలని, రైతు కూలీలకు ఆత్మీయ భరోసాను అమలు చేయాలని కోరారు. విద్య, వైద్య రంగాలను గాడిలో పెట్టేందుకు వాటి పర్యవేక్షణ బాధ్యతలు ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారులకు అప్పగించాలని కోరారు. ఇంకా ఎందరో రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు.

మండలిలో జూపల్లి వ్యాఖ్యలపై గందరగోళం

- తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్రను తక్కువ చేసే ప్రయత్నం
- ప్రతిఘటించిన బీఆర్ఎస్ సభ్యులు, మంత్రి వ్యాఖ్యలపై తీవ్ర నిరసన
- కొద్దిసేపు అదుపుతప్పిన సభ, చైర్మన్ జోక్యంతో వివాదానికి ముగింపు



హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాధనలో బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ నాయకుడు కేసీఆర్ పాత్రను నామమాత్రం చేసేందుకు ప్రయత్నించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తంచేశారు. మంత్రి బడ్జెట్‌పై కాకుండా ఇతర విషయాలను ప్రస్తావిస్తున్నారంటూ అభ్యంతరం తెలిపారు. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ సభ్యులు అసందర్భంగా మాట్లాడవద్దని డిమాండ్ చేశారు. శాసనమండలిలో శుక్రవారం బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న బీఆర్ఎస్ పక్ష నాయకుడు మధుసూదనాచారి మాట్లాడుతూ తెలంగాణలో సాధనలో కేసీఆర్ పాత్రను, ఆ తర్వాత రాష్ట్రంలో పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని కొనియాడారు. దీనిపై మంత్రి జూపల్లి స్పందిస్తూ తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను కాదనలేమని, అయితే విద్యార్థుల ఆత్మబలిదానాల వల్లనే తెలంగాణ వచ్చిందని అన్నారు. అంతకుముందు మంత్రి సీతక్క కూడా ఇదే విధంగా మాట్లాడారు. వారి వ్యాఖ్యలపై కొద్దిసేపు సభలో దుమారం రేగింది. బీఆర్ఎస్ సభ్యులు మధుసూదనాచారి, కవిత తదితరులు ఒక్కసారిగా లేచి నిరసన తెలిపారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని ఇరువర్గాలను వారించే ప్రయత్నం చేశారు. అయినా విమర్శలు, ప్రతి విమర్శలు ఆగలేదు. దీంతో చైర్మన్ మంత్రి మైక్ కట్‌చేసి ఆయనను కూర్చోవాలని చెప్పారు. అనంతరం బడ్జెట్‌పై మాట్లాడాలని కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. దీంతో గందరగోళం సద్దుమణిగింది.

నిధుల లేమితోనే ఆరు గ్యారెంటీలు ఆలస్యం

- కేసీఆర్ హయాంలోని పథకాలనూ మేము కొనసాగిస్తున్నాం : జీవన్‌రెడ్డి
- తెలంగాణ 'ఫోర్‌ఫ్రంట్' కేసీఆర్ : ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలుచేయలేకపోతున్నదని, ప్రస్తుతం కేసీఆర్ పథకాలనే కొనసాగిస్తున్నామని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతానికి రైతుభరోసా, రైతుబీమాతోపాటు మరికొన్ని పథకాలు అమలు చేస్తున్నామని, త్వరలోనే మరిన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పారు. గత సర్కారులో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అద్భుతమని కొనియాడారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. వ్యవసాయంతోపాటు పండ్ల తోటలకూ నీటిఎద్దడి ఏర్పడినట్టు చెప్పారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో 'ఫోర్ ఫ్రంట్' కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో కేసీఆర్ ముందుండి నడిపించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా వచ్చి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు.